అక్కడికి పోస్టింగ్ అంటేనే అయిష్టం!

- క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నా హెచ్ఆర్ఏలో కోత
- 17 మంది కానిస్టేబుళ్లకు గానూ ఐదుగురే దిక్కు!
- సిబ్బంది కొరతతో లభించని వీక్లీ ఆఫ్స్

జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో పోస్టింగ్ అంటేనే సిబ్బంది అయిష్టత చూపుతున్నారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను అంటగట్టి వచ్చే జీతంలో 12 శాతం హెచ్ఆర్ఏ కోత విధిస్తుండటంతో సిబ్బంది స్టేషన్ కోరుకోవడానికి నిరాకరిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో పోస్టింగ్ తీసుకున్నవారు కూడా పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 17 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సిన స్టేషన్‌లో ఐదుగురే ఉండటంతో వీక్లీ ఆఫ్స్ లేక పనిఒత్తిడితో సతమతమవుతున్నారు.

– జూపాడుబంగ్లా

జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 17మంది పోలీసుకానిస్టేబుళ్లు కలిపి మొత్తం 26 మంది పోలీసుసిబ్బంది ఉండాలి. కానీ ఒక ఎస్ఐ, ఒక ఏఎస్ఐ(ఒకరు డిప్యూటేషన్‌పై డోన్‌కు వెళ్లారు), ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఐదుగురు కానిస్టేబుళ్లలో ఒకరు సెంట్రీ, మరొకరు కంప్యూటర్ వర్క్, ఇంకొకరు కోర్టు డ్యూటీకి పోనూ మిగిలేది ఇద్దరే. వారు 12 గ్రామ పంచాయతీల బాధ్యతలు చూసుకోవాల్సి ఉంది. గ్రామాల్లో పర్యటించి ఏ క్షణాన ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తమ పై అధికారులకు సమాచారం అందించాల్సి ఉంది. ఒక ఏఎస్ఐ పోస్టుతోపాటు, నాలుగు హెడ్‌కానిస్టేబుల్స్, 12 కానిస్టేబుల్స్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అరకొర సిబ్బందితో విధులు నిర్వర్తిస్తున్న తమకు సకాలంలో ఇళ్లకు చేరుకోలేకపోగా గత కొన్ని మాసాలుగా వీక్లీ ఆఫ్ వర్తించటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ స్పందించి జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో సిబ్బంది నియామకం చేపట్టడంతో పాటు వీక్లీ ఆఫ్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతునారు.



జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్

శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్

18 ఏళ్ల క్రితం నిర్మించిన పోలీసు క్వార్టర్స్ మెయిన్‌టెనెన్స్ లేక శిథిలావస్థకు చేరుకుంది. గదులు శిథిలమైనా హెచ్ఆర్ఏ కట్ అవుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొంత మంది సిబ్బంది అందులోనే ఉంటున్నారు. క్వార్టర్స్ శిథిలమైనందున హెచ్ఆర్ఏ నుంచి మినహాయింపు ఇవ్వాలని సిబ్బంది కోరుతున్నా పట్టించుకునేవారు లేరు. ఇందులో నివాసం ఉన్నా, లేకపోయినా జీతాల్లోంచి మాత్రం 12 శాతం హెచ్ఆర్ఏ(హౌస్ రెంట్ అలవెన్స్) కట్ అవుతుంది. దీనికితోడు పట్టణాల్లో ఇంటి బాడుగలు చెల్లించాల్సి ఉండటంతో రెండు విధాలుగా నష్టపోతుండటంతో జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌కు పోస్టింగ్ తీసుకోవడానికి పోలీసులు జంకుతున్నారు. ఒక వేళ వచ్చినా ఇక్కడి పరిస్థితులు తెలుసుకుని తమ పలుకుబడి ఉపయోగించి డిప్యుటేషన్‌పై ఇతర స్టేషన్‌లకు వెళ్తున్నారు.

క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు


కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

శ్మశాన వాటిక స్థల సమస్య పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

పాములపాడు: మండలంలోని ఎర్రగుడూరు గ్రామంలో ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు నాగరాజు మంగళవారం దళితులు పుల్లయ్య, రాజన్న, నాగన్న, సుశీలమ్మతో కలిసి తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని 602, 603 సర్వే నంబర్లలో ఉన్న దళిత శ్మశాన వాటికను కొందరు ఆక్రమించుకున్నారని, ఇదే విషయంపై పీజీఆర్ఎస్‌లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తహసీల్దార్‌కు వివరించారు.

పిచ్చికుక్క కాటుకు కాడెడ్ల మృతి


పిచ్చికుక్క కాటుతో మృతిచెందిన ఎద్దు

కొత్తపల్లి: పిచ్చి కుక్క కాటుకు గురైన కాడెడ్లు కోలుకోలేక మృతిచెందిన ఘటన మండలంలోని నాగంపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. రైతు మాదిగ రాజుకు చెందిన ఎద్దులను వారం క్రితం పిచ్చి కుక్క కరిచింది. రైతు వీధి కుక్కలా భావించాడు. అయితే సోమవారం ఒక ఎద్దు, మంగళవారం ఒక ఎద్దు రేబీస్ లక్షణాలతో మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.2 లక్షల విలువ చేసే కాడెడ్లు మృత్యువాత పడ్డాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా అదే గ్రామానికి చెందిన రైతు రామస్వామి ఎద్దు కూడా మూడు రోజుల క్రితం మృతిచెందినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి గ్రామానికి చేరుకుని 150 పశువులకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేశారు.

పాఠశాలను సందర్శించిన డీపీఓ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలుర పాఠశాలను నంద్యాల డీపీఓ లలితబాయి సందర్శించారు. మంగళవారం పాఠశాలలో పారిశుద్ధ్యం, ఇతర సమస్యలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేపట్టాల్సి పనులపై విచారించారు.

జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: పీఎం సూర్యఘర్ పథకం కింద జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పీఎం సూర్య ఘర్ పథకంపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా ఆదాయం పెరగడంతో పాటు పొల్యూషన్ నివారణ జరుగుతుందన్నారు. ఒకసారి ఇంటిపై కప్పులపై సోలార్ ప్యానల్ పెట్టుకుంటే 25 ఏళ్ల వరకు విద్యుత్ సమస్య ఉండదన్నారు. ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అయితే ప్రభుత్వానికి అమ్మవచ్చు, కరెంటు పోతుందనే టెన్షన్ ఉండదన్నారు. ప్రతి గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రతి ఇంటి రూఫ్ టాప్ పైన సోలార్ ప్యానళ్లు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు బ్యాంకర్ల సహకారం తీసుకోవాలన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

ఆత్మకూరు: ఆగస్టు 4 నుంచి 6వ తేదీ వరకు నంద్యాలలో చేపట్టనున్న రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జునైద్‌బాషా కోరారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శిక్షణ తరగతుల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. జిల్లాలో విశ్వవిద్యాలయంతోపాటు ప్రభుత్వ ఐటీఐ, పీజీ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జావిద్, లోకేష్, క్రిష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుంతకందాల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ జహీర్‌వలి, కంటివైద్య నిపుణులు వేణుగోపాల్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి అవసరమైన వారికి అద్దాలు అందజేస్తామని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, పీహెచ్ఎన్ నాగలక్ష్మమ్మ, కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పాల్గొన్నారు.

పంటలను నమోదు చేయించుకోండి

వెలుగోడు: సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని ఏఓ స్వాతి సూచించారు. మంగళవారం మోతుకూరు, మాధవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని ఆమె సూచించారు.

- **బండి ఆత్మకూరు:** ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి ఆర్ పవన్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలో ఉన్న సంత జూటూరు గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. రైతులకు ఎమ్మార్పీకే ఎరువులను పంపిణీ చేయాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్సు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.


ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ స్వాతి

- **పాములపాడు:** పైర్లకు నానో యూరియాను పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో భాగంగా మద్దూరు, మిట్ట కందాల గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

పోలీసుల దాడి అమానుషం


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు: నెల్లూరు పట్టణంలో మున్సిపల్ కార్మికుల పట్ల పోలీసులపై అమానుషంగా దాడి చేయడం తగదని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగన్న, నాగరాజు ఖండించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న కార్మికులపై దాడి చేయడం తగదన్నారు. దాడులు చేసిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిమ్మయ్య, గొడుగు రాజు, రాజేష్, నాగన్న, సువర్ణమ్మ పాల్గొన్నారు.

అడవులను రక్షించుకోవడం అందరి బాధ్యత

శ్రీశైలంప్రాజెక్ట్: అడవులను రక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.రామకోటి అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మంగళవారం బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి హటకేశ్వరం, బయోపార్క్ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు పచ్చగా ఉంటేనే సమస్త జీవరాశి మనుగడ సాగిస్తుందన్నారు. పర్యావరణ సమతుల్యత పాటించడం వల్ల ఆక్సిజన్ శాతం మెరుగ్గా ఉంటుందన్నారు. అడవుల్లో చెట్లను నరకకుండా కాపాడుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగంతో భూమిలో మొక్కలు ఎదగవని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ అధికారులు ఎస్ బషీర్ అహ్మద్, కె.మధన్‌కుమార్, ఎస్.జయరాజు, సీహెచ్ పెద్దయ్య, పి.సలాం అల్లా, పి.శ్రీరాములు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.జవహర్, ఎకోడెవలప్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ నాగెళ్ల నాగేశ్వరరావు, సభ్యులు పి.మల్లయ్య పాల్గొన్నారు.


విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న అటవీ సిబ్బంది

పులుల సంరక్షణతోనే మానవ మనుగడ

మహానంది: పులుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ప్రతినిధి దూపాడు శ్రీధర్ అన్నారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా ఆధ్వర్యంలో గ్లోబల్ టైగర్ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాలు, ఆక్సిజన్ ఆక్సిజన్, ఆహారం మానవాళికి అందాలంటే అడవులు ఎంతో కీలకమని, అలాంటి అడవులు సంరక్షణలో ఉండాలంటే పులుల సంతతి పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డీఆర్ఓ హైమావతి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ రూఫ్‌టాప్

కోవెలకుంట్ల: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులకు సోలార్ రూఫ్‌టాప్‌లపై రాయితీ అందించనున్నట్లు బనగానపల్లె నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, ఎస్సార్బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంగోపాల్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ పథకానికి సంబంధించి మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గృహ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి పైకప్పుపై 10 చ.మీ లేదా 100 చదరపు అడుగుల స్థలంలో 1 కేడబ్ల్యూపీ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల వారు పీఎం సూర్య ఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల స్పెషల్ ఆఫీసర్ కల్యాణి, తహసీల్దార్, ఎంపీడీఓ, ట్రాన్స్‌కో ఏడీఈ, ఏఈ పాల్గొన్నారు.


వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న ఐపీఎస్ అంజనీకుమార్


మహానందిలో విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ చౌడేశ్వరీ

మహానందిలో జైళ్లశాఖ డైరెక్టర్

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ జైళ్లశాఖ డైరెక్టర్, ఐపీఎస్ అంజనీకుమార్ మంగళవారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ పూజలు

మహానందీశ్వరుడి సన్నిధిలో ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ చౌడేశ్వరీ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టగా దర్శనం అనంతరం స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేద పండితులు ఆశీర్వచనం చేశారు.

పంచాయతీకి ఆదాయం

పాములపాడు: వారపు సంత గేటు వేలంపాటలో పంచాయతీకి ఆదాయం సమకూరిందని పంచాయతీ కార్యదర్శి క్రాంతి తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో రూ.1,21,500లకు మహమ్మద్ ఘనీ దక్కించుకున్నార్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పేద కుటుంబాలను దత్తత తీసుకోండి

జూపాడుబంగ్లా: పేదరికంలో ఉన్న కుటుంబాలను దత్తత తీసుకుని అభివృద్ధిబాటలో నడిపించాలని మండల ప్రత్యేక అధికారి, జౌళిశాఖ ఏడీ నాగరాజరావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దత్తత తీసుకున్న అధికారులు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ ఆర్థిక అభివృద్ధికి చేయూతనివ్వాలన్నారు.

జీవన ఎరువులు వాడాలి

మహానంది: ఎకరా వరిపైరుకు 20 కిలోల ముడి జింకు వాడాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం గోపవరం గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. జింక్ సల్ఫేట్‌ను భాస్వరం ఎరువులతో కలిపి వాడొద్దన్నారు.

- **జూపాడుబంగ్లా:** మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు వ్యాప్తిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండ్లెం, తంగడంచ గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు.

యూరియా కొరత రానివ్వం

కొత్తపల్లి: రైతులకు యూరియా కొరత రానివ్వమని వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం తెలిపారు. మంగళవారం నాగంపల్లి సొసైటీని చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాతూ ఇటీవల సొసైటీకి 20 టన్నుల యూరియా వచ్చిందన్నారు. అవసరమైన రైతులు యూరియాను పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

మురుగు నీరు తొలగించాలి

నందికొట్కూరు: రోడ్లపై పారుతున్న మురుగు నీరు తొలగించాలని సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, గంధం హుసేనమ్మ కోరారు. మంగళవారం పగిడ్యాల మండల కేంద్రంలోని దేవనగర్‌లో సీపీఎం నాయకులు పర్యటించారు. డ్రైనేజీలు లేక ప్రజలు రోడ్డుపై నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నా అధికారులకు పట్టడం లేదని వారు విమర్శించారు. చిన్నపాటి వర్షానికి రోడ్లపై మురుగునీరు పారడంతో పాటు దోమల బెడదతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, చిట్టెమ్మ, సువర్ణమ్మ, లక్ష్మిదేవి ఉన్నారు.

రూ.10.35 కోట్లతో 55 వసతి గృహాలు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో రూ.10.35 కోట్లతో నిర్మించనున్న 55 వసతి గృహాల నిర్మాణ పనులు వెంటనే మొదలుపెడతామని దేవదాయశాఖ డీఈ శ్రీనివాసులు తెలిపారు. మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డితో కలిసి వసతి గృహాల స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం వసతి గృహాల నిర్మాణాన్ని బుధవారం నుంచి ప్రారంభించనున్నామన్నారు. అనంతరం దేవస్థానం పాత కార్యాలయం వద్దకు చేరుకుని భవనాన్ని పరిశీలించి, మరమ్మతులు చేసి వాడుకోవచ్చని సూచించారు. ఆయన వెంట ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, నీలకంఠరాజు, పి.సుబ్బారెడ్డి, ఏఈ శ్రీనివాసులు ఉన్నారు.

భక్తులతో మర్యాదగా నడుచుకోవాలి

శ్రీశైలంటెంపుల్: భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని వాహన డ్రైవర్లకు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం శ్రీశైలంలో సీఐ జి.ప్రసాదరావు అధ్యక్షతన ప్రైవేట్ వాహనాలు, ఆటో డ్రైవర్లు, వాహన యజమానులకు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వాహనాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనం నడపరాదని సూచించారు. యాత్రికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేయరాదన్నారు. కార్యక్రమంలో పోలీసులు రఘునాథుడు, బాలకృష్ణ, అమర్నాథరెడ్డి, వెంకటనారాయణ, నానునాయక్ పాల్గొన్నారు.


వాహన డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఈఓ ఎం.శ్రీనివాసరావు

ఎజెండా చదివారు .. సమావేశాన్ని ముగించారు

నందికొట్కూరు: మున్సిపల్ సాధారణ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని జైకిసాన్ పార్కులో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో ఎజెండాలోని అంశాలను మున్సిపల్ అధికారులు చదివి వినిపించిన తర్వాత కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించిన అనంతరం చైర్మన్‌తో పాటు ఆయన వర్గం కౌన్సిలర్లు వెళ్లిపోయారు. అనంతరం మాండ్ర వర్గం వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు సమావేశానికి వచ్చారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి


మున్సిపల్ కమిషనర్ బేబిపై మండిపడుతున్న కౌన్సిలరు జాకీర్ హుసేన్

చైర్మన్ సొంత ఇల్లా?

నెలకోసారి జరిగే మున్సిపల్ సాధారణ సమావేశం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు కొనసాగాలని కౌన్సిలరు జాకీర్ హుసేన్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. అవినీతిని ఎక్కడ ప్రశ్నిస్తారోననే భయంతో చైర్మన్ సమావేశాన్ని త్వరగా ముగించుకుని వెళ్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం

కోరం లేకుండా మున్సిపల్ సాధారణ సమావేశం ఎలా నిర్వహిస్తారని కమిషనర్ బేబిపై కౌన్సిలరు జాకీర్ హుసేన్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024–25 సంబంధించి మున్సిపాలిటీ ప్రజల నుంచి వసూలు చేసిన రూ.4.49 కోట్లు దేనికి ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని కమిషనర్‌ను కోరారు. దొంగ బిల్లులు పెట్టి ప్రజల సొమ్మును ఎలా కాజేస్తారని నిలదీయగా.. అవినీతి జరిగినట్లు నిరూపించాలని కమిషనర్ బేబి కోరారు.

సమస్యలతో విద్యార్థులు సతమతం

నందికొట్కూరు: బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు సమస్యలతో సమతమతమవుతున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్‌యాదవ్ ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు బీసీ హాస్టల్‌ను సందర్శించారు. అక్కడి సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను గాలికొదిలేశారన్నారు. కనీసం మౌలిక వసతులు కూడా కల్పించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచాలు లేక విద్యార్థులు బండలపైనే నిద్రిస్తున్నారన్నారు. హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట విద్యార్థి విభాగం నాయకులు అబ్దుల్లా, శశాంక్, లడ్డు, కరీం, బాషా, మధు ఉన్నారు.

- **జూపాడుబంగ్లా:** మండలంలోని గురుకుల పాఠశాల డైనింగ్‌హాల్, హాస్టల్‌ను వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్ పరిశీలించారు. ఆహారపదార్థాలను, మౌలిక వసతులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మునావర్, కరిముల్లా, ఇర్ఫాన్ పాల్గొన్నారు.


జూపాడుబంగ్లా: భోజనాన్ని పరిశీలిస్తున్న సురేష్‌యాదవ్

పాడి రైతులు సర్వేకు సహకరించాలి

బనగానపల్లె రూరల్: పాడి రైతుల జీవన ప్రమాణాలపై జరుగుతున్న సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని పశు సంవర్ధకశాఖ ఆళ్లగడ్డ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య కోరారు. స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం ఏడీఏ డాక్టర్ మారుతిసకారామ్ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. పాడి రైతుల్లో గొర్రెలు, మేకలు, కోళ్ల ద్వారా ఎంత ఆదాయం వస్తుంది. ఆయా కుటుంబాల వారు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నారా, ప్రభుత్వ పరంగా పాడి రైతులకు ఏఏ పథకాలు వస్తున్నాయి. తదితర సమగ్ర వివరాలను పశువైద్య సిబ్బంది రైతుల వద్దకు వెళ్లి సేకరించాలన్నారు. సెప్టెంబరు 15 వరకు సర్వే జరుగుతుందని చెప్పారు. పశు వైద్యులు డాక్టర్ సునీల్, పారాసిబ్బంది, ఏహెచ్ఏలు, గోపాలమిత్ర పాల్గొన్నారు.


ప్రారంభానికి నోచుకోని రైతుసేవా కేంద్రాలు



ప్రారంభం ఎప్పుడో?

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన రైతుసేవా(రైతుభరోసా)కేంద్రాలు ప్రారంభానికి నోచుకోవటం లేదు. రైతుల సంక్షేమార్థం గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జూపాడుబంగ్లాలో ఒక్కోటి రూ.21.80 లక్షల చొప్పున రెండు రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. భవనాలు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావటంతో వాయిదా పడ్డాయి. అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వాటి పేర్లను రైతుసేవాకేంద్రాలుగా మార్చింది. అందులో రైతు సేవాకేంద్రం–1 నిర్మాణం పూర్తికాగా, రైతుసేవాకేంద్రం–2 నిర్మాణం పూర్తి కావొచ్చింది. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు కాకపోవంతో భవనాలను వ్యవసాయ అధికారులకు అప్పగించడంలేదని పీఆర్ ఏఈ బషీర్ తెలిపారు. మరోపక్క అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రైతు సేవాకేంద్రాలను అద్దె భారమవుతుందనే ఉద్దేశంతో ఇటీవల మండల వ్యవసాయ కార్యాలయంలోకి మార్చినట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు.